# అరవైలో ఇరవై, ఇరవైలో అరవై

*- కలశపూడి శ్రీనివాసరావు*

ఇరవైఐదో ఏట దాకా ఇండియాలో బ్రతికి వచ్చి అమెరికాలో మరో ఇరవై ఐదేళ్ళు బ్రతికిన నాకు అమెరికా అయినా ఇండియా అయినా ఒకటే అన్న భావన చాలా గట్టిగా ఉండేది. అమెరికాలో పగలైతే ఇండియాలో రాత్రి, ఇండియాలో పగలైతే అమెరికాలో రాత్రి అని మొదలు పెట్టి ‘అక్కడ‘ ‘ఇక్కడ‘ అని వాదించే వాళ్ళని పట్టించుకునే వాడిని కాదు. అలాంటి నాకు కనువిప్పు కలిగించింది వాసా విశాలాక్షిగారి వాక్యం. “ఇండియాలో ఇరవైలో అరవైలా బ్రతికిన నేను అమెరికాలో నా అరవైలలో ఇరవైలలా బ్రతుకు తున్నాను.“




వాసా విశాలక్షిగారు న్యూయార్కులో సంగీతం టీచరు. కర్ణాటక సంగీతానికి చేతులడ్డుపెట్టి ఒక ‘కాపు‘ కాస్తున్నాం అని అనుకొంటున్న ఎందరో వ్యక్తుల కంటే, సంస్థల కంటే, ఎక్కువ ‘పెద్దకాపు‘ వాసా విశాలాక్షిగారు. నలభై ఏళ్ళగా ఆవిడ న్యూయార్కు లో ఉన్నారని గాని, ఎంతో సంగీత సేవ చేస్తున్నారని కాని న్యూయార్కులో ఎన్నాళ్ళున్నా మీకు నాకు తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే ఆమెను ఏసంఘాలు గుర్తించలేదు. అవార్డులు ఇవ్వలేదు. ఇండియా ఎబ్రాడ్ న్యూస్ పేపరులో వ్రాయలేదు. ఆవిడ చేస్తున్నసేవని, ఆవిడ ఉనికిని నలుగురికి తెలిసేలా చేసింది ఓ తెల్లవాడు. వాడికి సంగీతం కాని, భారతదేశం గురించి కాని ఏమీ తెలీదు. అసలు భారతదేశం అనేది ఉందని కూడా తెలియదు.

వాడికి తెలిసినదంతా రోజూ ‘ఎలాగో ఒకలాగ‘ డబ్బులు ‘సంపాదించి‘ ‘డ్రగ్స్‘ తీసుకొని ఆనందోబ్రహ్మ - అని జీవితం గడపడం. అలాంటి వాడికి సంగీత విద్వాంసురాలు, పూజ చెయ్యకుండా పచ్చి మంచినీళ్ళు అయినా ముట్టని, పరాయివాళ్ళ ఇళ్ళల్లో పళ్ళు తప్ప మరేమీ తినని ఛాందసురాలైన వాసావిశాలాక్షి గారికి లింకేమిటని ఆశ్చర్యపోకండి.. ఉంది.

ప్రతిరోజూ ఉదయం పూజ చేసుకొని, మడిగా వంటవండి భర్తకి పెట్టి, తాను తిని, పట్టుచీర కట్టుకుని లోపల థెర్మల్స్ (చలిని తట్టుకోడానికి తొడుక్కొనే లోపలి బట్టలు ) తొడుక్కుని, మఫ్లర్ కట్టుకొని, న్యూయార్కు బస్సులలో, సబ్‌వేలో తిరుగుతూ అభిరుచి ఉన్న వాళ్ళకి వెళ్ళి సంగీత పాఠాలు చెప్పడం ఆమె దినచర్యలో భాగం. అటువంటి ఒక రోజు ఆమెని సబ్‌వేలో ఓ తెల్లవాడు అటకాయించి ‘మగ్గింగ్‘ అనే మెన్ హాటన్ స్టైల్ ముష్టికై ప్రయత్నించాడు. ఆమె మగ్గింగ్ కోసం దాచుకొన్న ఐదు డాలర్లు ఇచ్చేఅంతలో ఆమె శృతి పెట్టెని పట్టుకొన్నాడు. అపుడు శృతి పెట్టె పట్టుకున్న ఆమె చెయ్యిని తాకాడు. ఐదు డాలర్లు ఇద్దామనుకున్న ఆమెకి వాడు చెయ్యి తాకడం వల్ల మడికి భంగం అయి కోపం వచ్చింది.

“ముష్టి వెధవ్వి ముష్టివెధవలా ఉండక ముట్టుకొని నామడి మైల చేస్తావా?“ అని అరిచింది.

ఆమె ఆవేశాన్ని ఆమె గాత్రం అద్భుతంగా అనువదించింది. పక్క వాడు చచ్చి పోతున్నా

పట్టించుకొని జనాన్ని నిలబెట్టింది. గొడవైంది. పోలీసులొచ్చారు.

"ఓస్ ఇంతేనా?" అని వెళ్ళిపోబోయారు. అలాంటి పోలీసుల్ని ఆపి 'మడి' దాని ప్రాముఖ్యత గట్రా వివరించారు. అటువంటి తప్పుని అమెరికా ఖండంలో చేసేవారిని వదిలేస్తే ఈ ఖండం అపవిత్ర మైపోతుందన్నారు.

"ముష్టి వాళ్ళు ముష్టి అడగడం మనం ఇవ్వడం సనాతన ధర్మం"అని చెప్పారు.

ఆమె చెపుతున్న విషయంకంటే ఎంతసేపైనా వినాలనిపించే ఆమె గొంతు వినడానికై మరిన్ని ప్రశ్నలు వేసారు పోలీసులు. ముచ్చటపడి కేసు రాసి, నమస్కారం పెట్టి వెళ్ళిపోయారు.

అమెరికాలో క్రైం న్యూసు ఎక్కువ. కాని అందులో ఇండియన్ పేర్లు తక్కువ. అంచేత మనం ఇక్కడ ఉన్నామని నలుగురికి తెలియదని, న్యూయార్కు అంటే 'మెల్టింగ్ పాట్' అని అది సంస్కృతుల సంగమం అని అందులో ఇవాళ 'మడి' అనే భారతీయ సంస్కృతికి సంబంధించిన విషయం అమెరికాలో క్రైం కి కొత్త కోణాన్ని ఇస్తుందని న్యూయార్కులోని ఇండియన్ ప్రెస్ విజృంభించింది.

వారు వాసా విశాలాక్షిగారి ఇంటి ఎడ్రస్ పట్టుకొన్నారు. కెమేరాలు వెంట తెచ్చుకున్నారు. ఆమెని వివిధ ప్రశ్నలు వేసారు. ఆమెకి ఇది ప్రథమ ఇంటర్వ్యూ అవడం వల్ల ఆమె ఏ సమాధానం చెప్పకుండా ముందు 'మహాగణపతిం...' అంటూ మొదలు పెట్టారు. ఆ తరవాత ఆమె అన్ని ప్రశ్నలకి సమాధానం చెప్పారు. ఆమె జీవిత చరిత్ర అంతా వివరించారు. మగ్గింగ్ పాలబడ్డా మరేమి జరిగినా 'అమెరికా' మాత్రమే నచ్చిందన్నారు. విలేఖర్లు వివరంగా చెప్పమన్నారు. ఎన్నో కారణాలు వివరాలు ఎందుకు ఒక్కటి చాలన్నారు ఆమె. ఆ సమాధానమే 'అమెరికాలోఅరవైలో ఇరవై, ఇండియాలో ఇరవైలో అరవై.' అదెలా అని ఆశ్చర్యంగా ప్రశ్నించింది. ఇరవైలలో ఉన్న జూహి ఝూన్ ఝూన్ వాలా అన్న విలేఖరిణి.

"నాకు ఇరవైవ ఏట పెళ్ళైంది. నేను వాళ్ళింట కాలు పెట్టిన వేళావిశేషం యేమో కాని నాభర్తకి ఢిల్లీలో ఉద్యోగం వచ్చింది. తుళ్ళుతూ, తేలుతూ, తిరుగుతూ సంగీతం ఊపిరిగా బ్రతుకుతున్న మాపల్లెటూరి నుండి ఢిల్లీ వెళ్ళిన నాకు అదో పెద్దజైలులా అనిపించింది. వాసావారింటి అబ్బాయి అని మానాన్న నన్ను ఒప్పించి చేసిన పెళ్ళి నాది. వారి ఇంట ఉన్న సంగీత సాంప్రదాయాన్ని గౌరవించి, అటువంటి కుటుంబం లో పుట్టిన ఆయనకి 'ఇంగువ కట్టిన గుడ్డ'లా ఎంతో కొంత సంగీతం రాదా అని అనుకొన్నాం. అయితే అది మారోజుల్లో పెళ్ళిచూపుల్లో పెళ్ళికూతురు ప్రశ్నలు అడగలేదు కదా.. పెళ్ళైన తరువాత తెలుసుకొందాం అని వాయిదా వేసాను. ఢిల్లీ వెళ్ళిన తరువాత తెలిసింది అది 'ఇంగువ కట్టిన గుడ్డే' కాని మా ఆయన తరంలో అది 'సర్ఫ్' వేసి శుభ్రంగా ఉతికి ఆరేసిన బట్ట అని. ఆయనకి సంగీతం రాకపోతేనేం నలుగురికి పాఠాలు చెప్పుకుని నా సంగీతాన్ని నిలబెడదాం అనుకొన్నాను. కాని కుదిరేది కాదు. రోజు తెల్లవారుఝామున మూడు గంటలకి లేచి నీళ్ళు పట్టుకోవాలి. ఐదు గంటలకి పాలబూత్ దగ్గరకి వెళ్ళి పాలు తెచ్చుకోవాలి. ఆరుగంటలకి భర్తని లేపి కాఫీ అందించాలి. ఏడు గంటలకి పిల్లల్ని లేపి తయారు చెయ్యాలి. వంట చెయ్యాలి. వాళ్ళని బస్సెక్కించాలి భర్తకి టిఫిన్ పెట్టాలి. కేరేజ్ కట్టి ఇయ్యాలి. మార్కెట్‌కి వెళ్ళాలి. ఆతరవాత ఇంత తిని పడుకొందామంటే కుదరదు కొత్తగా కొన్న టీ.వి చూడడానికి రోజు పొరుగువాళ్ళు వస్తారు. కునికి పాట్ల మధ్య చూస్తు లేస్తు ఉండే సరికి పిల్లలు వచ్చేస్తారు. రాత్రి పదిదాకా ఏవేవో పనులు. పడుకునే సరికి పదకొండు. మళ్ళీ తెల్లవారుఝామున మూడు గంటలకి లేవడం. అలా పని చేసి చేసి నా ఇరవైలలో అరవైఏళ్ళదానిలా తయారైయ్యాను. నాకు నచ్చిన సంగీతానికి కనీసం ఓ గంటైనా రోజులో దొరికేది కాదు. కాని ఇప్పుడు అరవైలలో అమెరికాలో నాకు నచ్చిన సంగీతాన్ని నలుగురికి నేర్పుకొంటున్నాను. అంచేత ఇండియాలో ఇరవైలో అరవైలా బ్రతికిన నేను అమెరికాలో అరవైలో ఇరవైలా బ్రతుకుతున్నాను" అన్నారు.

అది ITVలో విన్న నాకు అమెరికా జీవితం గురించి కనువిప్పు కలిగింది. అప్పటినుండి నేను చూసిన, విన్న అమెరికా భారతీయ జీవనం లోని అనుభవాలు నామెదడులో శతపత్రదళ పుష్పంలా వికశించడం మొదలు పెట్టాయి.

******